క్లుప్తంగా

మండల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం



సన్మానిస్తున్న ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, అధికారులు, ఈజీఎస్ సిబ్బంది బుధవారం వారిని సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో సమ్మిరెడ్డి, ఈజీఎస్ ఏపీడీ సత్యనారాయణ, విజిలెన్స్ ఆఫీసర్ కొమురయ్య, అంబుడ్స్‌మెన్ శివప్రసాద్, ఏపీవో మల్లీశ్వరి, ఈజీఎస్ ఎస్‌ఆర్‌పీ కార్యాలయ సూపరింటెండెంట్ ఫక్రుద్దీన్ బాబా పాల్గొన్నారు.

మూడోరోజు కొనసాగిన దీక్ష

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికులకు దీపావళి పండుగ సందర్భంగా చెల్లించే బోనస్ గతంలో కంటే అదనంగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ పర్మినెంట్ కార్మికసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష బుధవారం మూడోరోజుకు చేరుకుంది. కార్మికసంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డితో పాటు పలువురు కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. సమీప గ్రామాలకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు దీక్షకు మద్దతు ప్రకటించి దీక్షలో పాల్గొన్నారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, ఇటిక్యాల శ్రీకాంత్, బూడిద కుమార్, తెల్ల కనుకయ్య, కన్నం కనుకయ్య, దశరథం, నారాయణ పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా కార్మికులకు దీపావళి బోనస్

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల టోల్‌ప్లాజాలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, సిబ్బందికి దీపావళి బోనస్ ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య తెలిపారు. 2014లో ప్రారంభించిన టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న కార్మికులకు దీపావళి బోనస్ పదేళ్లుగా యాజమాన్యం చెల్లించడం లేదు. దీంతో ప్లాజా కార్మికులు డీసీసీ ప్రధాన కార్యదర్శిని కలిసి విన్నవించారు. కాగా టోల్‌ప్లాజా నిర్వహణ సంస్థ ఫేయిర్‌వేస్ కంపెనీ అధికారులతో జరిపిన చర్చల మేరకు ఒక్కొక్కరికి రూ.5వేలు దీపావళి బోనస్‌గా చెల్లించేందుకు యాజమాన్యం ఒప్పుకున్నట్లు సమ్మయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్లాజా కార్మికులు కృతజ్ఞతగా సమ్మయ్యను సత్కరించారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్, విండో చైర్మన్

ధర్మారం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరిధాన్యం కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ కోరారు. మండలంలోని పెర్కపల్లి, బంజేరుపల్లి, బొమ్మారెడ్డిపల్లి, కొత్తపల్లి, చామనపల్లి గ్రామాల్లో బుధవారం మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డితో కలిసి కేంద్రాలను వారు ప్రారంభించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, విండో వైస్‌చైర్మన్ రాజమల్లయ్య, డైరెక్టర్లు రాజేశం, రూప్లానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రామగుండం అభివృద్ధి



మాట్లాడుతున్న ఆసిఫ్ పాషా, నాయకులు

జ్యోతినగర్: కాంగ్రెస్ పాలనలో రామగుండం అభివృద్ధి చెందుతుందని, మరిన్ని విద్యుత్ వెలుగులు అందించే కొత్త ప్రాజెక్టులు రావడానికి సాధ్యమైందని పార్టీ ఎన్టీపీసీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా అన్నారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా నిర్మించనున్న జెన్‌కో, ఎన్టీపీసీ విద్యుత్ ప్రాజెక్టుల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించటానికి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కృషి చేస్తున్నారని తెలిపారు. డీసీసీ అధికార ప్రతినిధి వెంగల బాపు, ప్రధాన కార్యదర్శి మేరుగు లింగమూర్తి, డివిజన్ల అధ్యక్షులు రవి, భరత్‌గౌడ్, కిషన్‌రెడ్డి, నాయకులు అబ్దుల్లా, ఆంజనేయులు, సదానందం, లింగమూర్తి, రాజేశం, అన్వేష్ పాల్గొన్నారు.

ప్రతీ నెల పోలీస్‌స్టేషన్ల తనిఖీ

• రామగుండ సీపీ శ్రీనివాస్



కేసుల వివరాలు తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాస్

ధర్మారం: ధర్మారం పోలీస్‌స్టేషన్ పనితీరు బాగుందని రామగుండం సీపీ శ్రీనివాస్ కితాబిచ్చారు. ధర్మారం పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీపీ మాట్లాడుతూ ప్రతీనెల పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, ఇందులో భాగంగానే ధర్మారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశామని తెలిపారు. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో కటికెనపల్లి గ్రామాన్ని సమస్యాత్మక గ్రామంగా గుర్తించామని, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు వారోత్సవాలలో భాగంగా ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసుకుని సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుని ప్రమాదాలు జరగకుండా రోడ్డు మరమ్మతు పనులు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ధర్మారం ఎస్సై శీలం లక్ష్మణ్ పాల్గొన్నారు.

అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ తీసుకోవాలి

కమాన్‌పూర్: పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చూడాలని రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక ఠాణాను సీపీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఫిర్యాదులపై ఆరా తీశారు. రాత్రివేళ అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయాలపై నిఘా ఉంచాలని సూచించారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్, టూటౌన్ సీఐ ప్రసాదరావు, ఎస్సై ప్రసాద్ ఉన్నారు.

నిత్యం రైతు సేవకోసం పనిచేస్తా



సుల్తానాబాద్‌రూరల్: పత్తి సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: నిత్యం రైతుసేవ కోసమే పనిచేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వలలోని శ్రీవేంకటేశ్వర జిన్నింగ్‌మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి కొనుగోలు సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, సీసీఐ అధికారి రత్నాకర్, కార్యదర్శి మనోహర్, ఏఎంసీలు చైర్మన్ ప్రకాశ్‌రావు, స్వరూప, మిల్లు యజమాని శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మహేందర్, అబ్బయ్యగౌడ్, మాజీ ప్రజాప్రతినిధులున్నారు.

పోటీలతో నైపుణ్యం పెరుగుతుంది

సుల్తానాబాద్: పోటీలతో క్రీడాకారుల్లో నైపుణ్యం పెరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పట్టణంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అండర్-17 బాలబాలికల జిల్లా ఖోఖో పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందడంతోపాటు క్రమశిక్షణ, శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. డీఈవో మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, సురేందర్, దాసరి రమేశ్, సాయిరి మహేందర్, బిరుదు కృష్ణ, మండల అధ్యక్షులు చిలుక సతీశ్, కిశోర్, అమిరిశెట్టి తిరుపతి, సీనియర్ పీఈటీలు ప్రసాద్, సంపత్, ఇక్బాల్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఓదెల: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని కొలనూర్‌లో మాజీ సర్పంచు మారవేన రామస్వామి ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ ఉపసర్పంచు పాకాల సంపత్‌రెడ్డి, నాయకులు కుంచం మల్లయ్య, చింతిరెడ్డి విజేందర్‌రెడ్డి, మ్యాకల సమ్మయ్య, బిక్షపతియాదవ్, ఏవో భాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



పరిశీలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

రామగిరి: మండలంలోని పన్నూర్ గ్రామం లద్నాపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సహకరించాలని డీపీవో వీరబుచ్చయ్య కోరారు. బుధవారం గ్రామంలో పర్యటించి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని మురుగుకాలువ నిర్మాణంపై పన్నూర్ గ్రామస్తులతో చర్చించారు. సింగరేణి నిధులతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణాన్ని అడ్డుకోవద్దని, సింగరేణి యాజమాన్యం చేపట్టే అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీడీవో శైలజారాణి, ఆర్జీ-3 ఎస్టేట్ అధికారి కె.ఐలయ్య, ఎంపీవో ఉమేశ్, కార్యదర్శి ప్రేమలత, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ఆదేశించారు. పన్నూర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో బద్రి శైలజారాణి, ఎంపీవో ఉమేశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

టవర్ కథ సుఖాంతం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో టవర్‌పైకి ఎక్కిన రాకేశ్ కిందికి దిగక పోలీసు అధికారులు, గ్రామస్తులను హైరానా పెట్టాడు. రామగుండం పోలీస్ కమిషనరేట్ నుంచి ప్రత్యేక సిబ్బంది వచ్చి టవర్‌పైకి ఎక్కి కిందికి దింపడంతో కథ సుఖాంతమైంది. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, బసంత్‌నగర్ ఎస్సై స్వామి తమ సిబ్బందితో తెల్లారేదాకా అక్కడే వేచి ఉన్నారు. అంబులెన్సు వాహనాన్ని కూడా సిద్ధంగా ఉంచారు. రాకేశ్‌ను బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

రామగిరి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని మంథని డీఎల్‌పీవో సతీశ్ అన్నారు. మండలంలోని బేగంపేట గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్, నర్సరీల నిర్వహణ, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో ఉమేశ్, కార్యదర్శి రత్నాకర్ ఉన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మించడం అభినందనీయం



వాటర్ ట్యాంకు ప్రారంభిస్తున్న పుట్ట మధూకర్

ముత్తారం: గ్రామంలో పశువుల దాహం తీర్చడం కోసం వాటర్ ట్యాంకు, పశువుల తొట్టి నిర్మాణం చేపట్టడం అభినందనీయమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌లో మధుసూదన్ స్మారకార్థంగా అతడి కుమారుడు చిగురు విద్యాసాగర్ పశువుల కోసం నిర్మించిన వాటర్ ట్యాంకు, తొట్టిని పుట్ట మధు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పప్పు స్వరూప, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నూనె కుమార్, మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు పోతిపెద్ది రమణరెడ్డి, రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రావు, నాయకులు శేరు స్వామిపటేల్, కటూకూరి రాజిరెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

అవినీతి మూలంగానే అభివృద్ధిలో వెనుకంజ

గోదావరిఖని: అవినీతి మూలంగానే దేశం అభివృద్ధిలో వెనుకంజలో ఉందని గెస్ట్ లెక్చరర్ కిషోర్ బగాద్దెయో అన్నారు. ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ఆర్జీ-1, 2, 3, ఏపీఏ, భూపాల్‌పల్లి అధికారులతో బుధవారం 'కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పెరిటీ' అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. సమగ్రత సంస్కృతి-దేశ పురోభివృద్ధి అనే నినాదం ఈ ఏడాది విజిలెన్స్ వారోత్సవాల ఉద్దేశమన్నారు. అధికారులు కిరణ్‌బాబు, ఆంజనేయులు, మోహన్‌రావు, క్రాంతి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, డానియల్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సారంగపాణి, హన్మంతరావు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్‌కు నల్లవజ్రం అవార్డు

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ జీదుల రవీందర్‌ను తారా ఆర్ట్స్ అకాడమీ సంస్థ నల్లవజ్రం అవార్డుకు ఎంపిక చేసింది. గోదావరిఖనిలోని నిరీక్షణ ఆర్ట్స్ క్రియేషన్స్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రవీందర్‌ను ప్రతినిధులు సన్మానించి నల్లవజ్రం పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఇండియన్ పీపుల్ థియేటర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కవ్వంపల్లి స్వామి, నిర్వాహకులు మేజిక్ రాజా, చంద్రపాల్, కన్నం లక్ష్మి నారాయణతోపాటు షబ్బీర్ అహ్మద్, కనకయ్య, రాజిరెడ్డి, రాజయ్యగౌడ్, జాన్ ఈవెన్ పాల్గొన్నారు.

• రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆకుల అక్షిత రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఆసిఫాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యపతకం సాధించిన అక్షితను విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ అభినందించారు. విద్యార్థినికి మెలకువలు నేర్పించిన పీఈటీ శ్రవంతిని అభినందించారు. కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ ఉన్నారు.

• చేనేత ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షురాలిగా విజయ

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర చేనేత ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షురాలిగా యైటింక్లయిన్‌కాలనీకి చెందిన పద్మశాలీ సేవా సంఘం మహిళా అధ్యక్షురాలు భీమనాది విజయను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆడెపు శంకర్ ప్రకటించారు. బుధవారం చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్ ఆదేశాల మేరకు నియామక పత్రం అందజేశారు.

• ప్రభుత్వ పాఠశాలలో మెడికల్ క్యాంపు

రామగిరి: మండలంలోని బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం కోహినీ ఫౌండేషన్ ద్వారా ఎన్టీపీసీ యాజమాన్యం ఆర్థికసాయంతో మెడికల్ క్యాంపు నిర్వహించారు. పాఠశాలలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులకు మూడునెలలకు సరిపడా మందులు అందజేశారు. అలాగే రెండో విడత దంత సమస్యలు ఉన్నవారికి వైద్యం అందిస్తామని తెలిపారు. వైద్యులు అచ్యుత్, శివచందన, విఖాత, చందన, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.రాంకిషన్‌రావు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు సంపత్, రాణి, మంగ, శ్రీదేవి, స్వరూప పాల్గొన్నారు.

• రోడ్డు ప్రమాదంలో బీసీ వెల్ఫేర్ అధికారికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రంగారెడ్డికి గాయాలయ్యాయి. బీసీ వెల్ఫేర్ అధికారి కారులో గోదావరిఖని వైపు వెళ్తుండగా అప్పన్నపేట శివారులో బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో అప్పన్నపేట యువకులకు కూడా గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని బసంత్‌నగర్ ఎస్సై స్వామి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

• అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలకు దిగుతున్నారని కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, దీటి బాలరాజు, తిప్పారపు శ్రీనివాస్ విమర్శించారు. ఫంక్షన్‌హాల్ పేరిట సొంత వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోక తప్పదన్నారు. ఈవిషయంలో ఎమ్మెల్యేపై చేస్తున్న విమర్శలను ఖండిస్తున్నామన్నారు.

• సాగని సర్వే

జూలపల్లి: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కులగణన సర్వే బుధవారం సాగలేదు. 6వ తేదీ నుంచే సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు ప్రకటించిన అధికారులు ఇందుకు సంబంధించిన కుటుంబాల గుర్తింపును 13 పంచాయతీల్లో పూర్తి చేశారు. 6 నుంచి సర్వే చేసేందుకు ఎన్యూమరేటర్లను, సూపర్‌వైజర్లను సిద్ధం చేసిన అధికారులు సర్వేకు సంబంధించిన సామగ్రి సరఫరా కాకపోవడంతో సర్వే ప్రారంభించలేకపోయారు. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలలో ఉన్న వారు సమగ్ర సర్వేకు రాగా, సర్వే నిర్వహించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

• షీటీం నిరంతర నిఘా

గోదావరిఖనిటౌన్: స్థానిక సప్తగిరి కాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించింది. షీటీం సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, పాఠశాలలు, కళాశాలల వద్ద షీటీం నిరంతరం నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా విద్యార్థులు, మహిళలు వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు కాల్ చేసి సమస్య తెలపాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• సదర్ నిర్వహణకు నిధులు ఇవ్వండి

మంథని: సదర్ పండుగలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరమే గానీ నిర్వాహణకు నిధులు మంజూరు చేయకపోవడం సరికాదని యాదవ సంఘం మంథని డివిజన్ అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్ అన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. నాయకులు పెగడ శ్రీనివాస్, వేముల లక్ష్మ య్య, కనవేన కొమురయ్య ఉన్నారు.

• సమగ్ర సర్వేకు సహకరించాలి

రామగిరి: సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీవో శైలజారాణి కోరారు. కార్యాలయంలో సర్వేపై బుధవారం కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈనెల 9 నుంచి సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఎంపీవో ఉమేశ్, ఈసీ లక్ష్మణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.



కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో విద్యుత్ విద్యుత్ స్తంభాలకు చెట్లకొమ్మలు అల్లుకొని ప్రమాదంగా ఉన్నాయి. విద్యుత్ తీగలకు ఇలా చెట్లకొమ్మలు ఉండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు చెట్లకొమ్మలతో పాటు తీగలను తొలగించాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఉద్యోగ విరమణ అధికారికి సన్మానం



నారాయణను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీ-2 ఏరియాలో ఐటీ మేనేజర్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన బండి నారాయణను బుధవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో నారాయణను సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం మధుసూధన్, ప్రాజెక్టు అధికారి నెహ్రూ, ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, పర్సనల్ డీజీఎం ఎస్.అనిల్ కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించాలి



ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న డీపీవో

సాక్షి స్పందన

రామగిరి: ఆర్జీ-3 ఏరియాలోని సెంటినరికాలనీ కార్మికులకు తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించాలని ఆర్జీ-3 ఏరియా సింగరేణి సివిల్ అధికారులను జిల్లా పంచాయితీ అధికారి వీరబుచ్చయ్య ఆదేశించారు. ఈ నెల 3న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'సెంటినరికాలనీలో నీటిఎద్దడి' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పంచాయతీ అధికారి సెంటినరికాలనీలోని ఫిల్టర్ బెడ్, వాటర్ ట్యాంక్, పైపులైన్లను పరిశీలించారు. గోదావరి నదిలో ఏర్పడిన నీటికొరతతో డివిజన్‌లో నీటి సమస్యలు ఎదురవుతున్నాయని సింగరేణి అధికారులు వివరించారు. తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలని, అందుబాటులోని వనరులు ఉపయోగించుకుని నీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, కార్మికులకు ఇబ్బంది కలగకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. ఆర్జీ-3 సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, డీవైఎస్ఈలు రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, ఎంపీవో ఉమేశ్, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణారెడ్డి, పన్నూర్ మాజీ ఎంపీటీసీ మహేశ్ పాల్గొన్నారు.

ఓసీపీ-3 ప్రాజెక్టులో తృటిలో తప్పిన ప్రమాదం



కిందపడిన బండరాయి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. ప్రాజెక్టు డంపింగ్‌యార్డు నుంచి క్వారీకి ఓబీమట్టితో వెళ్తున్న వోల్వో వాహనం నుంచి పెద్ద బండ కిందపడింది. అదే సమయంలో అండర్ బ్రిడ్జి కింది నుంచి ఎలక్ట్రికల్ సెక్షన్‌కు చెందిన డీసీ రిపేర్ వ్యాన్ నలుగురు కార్మికులను తీసుకు వెళ్తోంది. అండర్ బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న వోల్వోలో బండ పడిన సంఘటనపై కార్మికులు భయాందోళన చెందుతున్నారు. పెద్ద బండ కింది నుంచి వెళ్తున్న వాహనంపై పడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని అంటున్నారు. అండర్ బ్రిడ్జిపై నుంచి వెళ్లే వాహనాలు ఓవర్‌లోడ్‌తో వెళ్లడం మూలంగా ఈ ఘటన జరిగిందని, ఓవర్‌బ్రిడ్జిపై నుంచి బండలు పడినప్పటికీ కింది నుంచి వెళ్లే వాహనాలపై పడకుండా ఐరన్‌మెష్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ సంఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారిగా రాజశేఖర్



శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారిగా జింగిటి రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఫేజ్-2 భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధికారులతో కలిసి ప్రాజెక్టు క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రాజెక్టు అధికారి రాజశేఖర్‌ను ఇంజినీర్ ఉదయ్‌భాస్కర్, కిషన్, యానాదిశెట్టి, డీటీరావు, గడ్డం తిరుపతి, సునీల్‌ప్రసాద్, సాయికృష్ణ, రాజిరెడ్డి తదితరులు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏఎస్సైగా బాధ్యతలు స్వీకరణ

రామగిరి: రామగిరి ఏఎస్సైగా బుధవారం ఈదునూరి స్వామి బాధ్యతలు చేపట్టారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రామగిరి: మండలంలోని కల్వచర్ల, లొంకకేసారం, రత్నాపూర్, నాగెపల్లి, నవాబ్‌పేట, బేగంపేట, లద్నాపూర్, రాజాపూర్ గ్రామాల్లో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ఏపీఎం స్వరూపరాణి తెలిపారు.